తెలిసిన విలువలు

బి. ప్రేమలీ రావ్

నాలుగున్నరకు స్కూల్లో లాంగ్‌బెల్ మ్రోగింది. హేండ్‌బ్యాగ్ తీసుకొని ఇంటికి బయలుదేరింది వసుధ. ఆమెకి ఆవేళ అతి ఉత్సాహంగా వుంది. తను తొలిసారిగా జీతం అందుకున్న రోజు. ఆ ఉదయం ఆఫీస్ రూంలో జీతం అందుకున్న వెంటనే తండ్రికి ఏభై రూపాయలు మని ఆర్డర్ చేసింది. 'నాన్నా! ఈవేళే నా మొదటి జీతం అందుకున్నాను. నా సంతోషంకొద్దీ పంపుతున్నాను. నీ పాకెట్‌మనీగా వాడుకో' అంటూ కూపన్లో రాసింది.

చకచకా ఇంటికి వస్తూన్న వసుధలో అనేక ఆలోచనలు. ఇకనుంచి తమకెలాంటి ఇబ్బందులూ వుండవు. తమ సంసారం హాయిగా గడిచిపోతుంది. ప్రసాద్‌తో సంప్రదించకుండా తన తండ్రికి డబ్బు పంపినందుకు ఆయన ఏమీ అనుకోడు కదా! అయినా ప్రసాద్ మనస్తత్వం తనకి బాగా తెలుసు. కట్నం ఆశించకుండా తనని పెళ్ళి చేసుకున్న విశాల హృదయుడు. ఇంత చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకొనేంత సంకుచిత మనస్సు కలవాడు కాడు. తను చేసిన పనిని తప్పక హర్షిస్తాడు.

ఆమె ఇల్లు చేరుకొనేసరికి తలుపులు తెరిచే వున్నాయి. ఎంత సర్ది చెప్పుకున్నా గుండెల్లో ఏదో 'కంపనం' లాంటిది వినిపిస్తూనే వుంది. ప్రసాద్ హాల్లో కూర్చొని పేపరు చూస్తున్నాడు. వసుధను చూసి పేపరు బల్లమీద పడేసాడు.

"వసూ! ఈవేళ 'జాలీ డే'. వంట ఏర్పాట్లేం చేయకు! అలా సరదాగా ఏ పిక్చరుకో పోయి హోటల్లో భోంచేసేద్దాం. ఓ కే!" అన్నాడు. వసుధ ఎగిరి గంతేసినంత పనిచేసింది.

"ష్యూర్! ఉండండి. మొహం కడుక్కుని కాఫీ చేసి పట్టుకొస్తా" అని పరిగెత్తబోయింది.

"ఆ శ్రమేం లేదు లేవోయ్. కాఫీ ఫ్లాస్కులో

డాక్టర్ అడవికొలను సీతాకుమారి

నేడు విద్యారంగంలో వనితలు ఎంతో ముందంజ వేస్తున్నారు. అంతేకాదు. తాము నేర్చిన విద్యని పదిమందికి చెబుతూ భావి భారత పౌరులను తీర్చి దిద్దడంలో తీవ్ర కృషి సలుపుతున్నారు. ఇది ఎంతైనా గర్వించదగ్గ విషయం. అటువంటి వారిలో చెప్పుకో దగ్గవారు-శ్రీమతి అడవికొలను సీతాకుమారి.

బరంపురంలో జన్మించిన సీతాకుమారి అక్కడి కళ్ళికోట కళాశాల ద్వారా బి. ఏ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యారు. అటు పిమ్మట కాశీ విశ్వవిద్యాలయం ద్వారా ఎం. ఎస్సీ పట్టం పొందారు. ఆ విశ్వవిద్యాలయాని కంతటికీ ఆమె ద్వితీయురాలుగా రావడం విశేషం!

తాను నేర్చిన విద్య నలుగురికీ చెప్పాలన్న తపనతో ఆమె పాట్నా విశ్వవిద్యాలయం స్త్రీల కళాశాలలో ఉపన్యాసకురాలుగా చేరారు. అక్కడ ఉద్యోగం చేస్తూ వుండగానే భారత ప్రభుత్వ ఉపకారవేతనంపై ఆమె డాక్టరేట్‌కు కృషి చేశారు. ఆ విధంగా ఆమె కాశీ విశ్వవిద్యాలయం ద్వారా భౌతిక శాస్త్రంలో పి. హెచ్ డి. సంపాయించారు. పాట్నా విశ్వవిద్యాలయంలోనే రీడర్‌గా కొంతకాలం వున్నారు.

పాట్నా విశ్వవిద్యాలయంలో వున్నప్పుడు అక్కడి స్త్రీల హాస్టల్ కమిటీలో సభ్యురాలిగానూ, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లోనూ, మోడరేటర్స్ సమాఖ్యలోనూ సభ్యురాలుగా వుండేవారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొంతకాలం అకడెమిక్ కౌన్సిల్ సభ్యురాలుగానూ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యురాలుగానూ వుండి తన ప్రతిభను కనబర చారు సీతాకుమారి.

ప్రస్తుతం ఆమె విజయనగరం మహారాజ స్త్రీల కళాశాల ప్రిన్సిపాలుగా వుంటున్నారు. ఆమె ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యురాలు కూడా.

భారత ప్రభుత్వం గత సంవత్సరం దేశం మొత్తంపై ఆరుగురు కళాశాల ఉపన్యాసకులను వారి విద్యా ప్రావీణ్యతకు గుర్తుగా ఎంపిక చేసింది. వారిలో సీతాకుమారిగారు ఒకరు కావడం విశేషం!

ఈ ఆరుగురూ అమెరికాదేశంలోని విద్యావిధానం పరిశీలించేందుకై అక్కడి వివిధ నగరాలు పర్యటించారు.

శ్రీమతి సీతాకుమారి రాసిన 'పరమాణు భౌతిక శాస్త్రం'-గ్రంథాన్ని తెలుగు అకాడెమీ వారు బి. ఎస్సీ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించారు.

శ్రీమతి సీతాకుమారి భర్త శ్రీ అడవికొలను శ్రీరామచంద్రమూర్తి కూడా విద్యావేత్త కావడం మరో విశేషం! ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయకళాశాలలో రీడర్‌గా వుంటున్నారు. ఇలా భార్యాభర్తలిద్దరూ కూడా విద్యారంగంలో కృషి చేయడమన్నది చెప్పుకోదగ్గ విషయం – అదొక విశేషం!

—ఎస్. ఎస్.

రెడీగా వుంది. ఇక వసుధ గారు త్రాగడమే ఏటు వాయి" అన్నాడు చిలిపిగా.

"అరె! మీరు చేసారా! చాలా థాంక్స్అండి" అంటూ వసుధ బాత్‌రూంలోకి పరిగెత్తింది.

"వసూ!" పిలిచాడు ప్రసాద్. 'ఇదిగో నా సాలరీ' అంటూ ఆరు పచ్చనోట్లు ఆమెకు అందించాడు. వసుధ కూడా తన సాలరీ అతనికి చూపిద్దామనే కుతూహలంతో హేండ్‌బాగ్ తీసింది.

"ఏమండీ! శ్రీవారూ! ఏదిలా చేయి చాపండి! ఇదిగోనండి మీ అర్ధాంగి ఫస్ట్ సాలరీ" అంటూ అతని చేతిలో కవరు ఉంచింది.

"జీతంలో 50 రూపాయలు మా నాన్నకి పంపానండి. మీరేమనుకోరనే ధైర్యంతోనే...." వసుధ మాటలు తక్కున మధ్యలోనే ఆగిపోయాయి.

అంతవరకు అతి ప్రసన్నంగా వున్న అతని ముఖం క్షణంలో గంభీరమైపోయింది. ఇంతవరకూ వసుధ గుండెల్లో అజ్ఞాతంగా వున్న గుబులు ఆమె మొహంలోకి ఒక్కసారిగా పెల్లుబికింది.

తెరవబోతున్న కవరును ఒక్కసారిగా తక్కున బల్ల మీద విసరిపడేసాడు ప్రసాద్. 'ఆ వివరాలన్నీ ఇక నాకెందుకులే! మిగతాది నీ ఇష్టం. ఏం చేసుకుంటావో, ఎవరికి పంపుకుంటావో, నీ జీతం, నీ ఇష్టం.'—విసురుగా బయటకు నడిచాడు. అతి ఉల్లాసకరంగా వున్న వాతావరణం క్షణంలో భయంకరంగా మారిపోయింది. వసుధ మనస్సు అవమానంతో - కుతకుతలాడిపోయింది. రోషంతో - స్వాభిమానంతో ఆమె హృదయం బుసలుకొట్టింది. అనుకోని ఈ హఠాత్సంఘటనకి ఆమె మనస్సు బాగా దెబ్బతింది. తను ఉద్యోగంలో చేరిన తరువాత అందుకున్న తొలి జీతం ఇది. రిటైర్ అయి ఇంట్లో వుంటూన్న తన తండ్రికి ఒక్క ఏభై రూపాయలు పంపుకోవడానికి తనకి హక్కు లేదా! ప్రతి నెలా ప్రసాద్ తన జీతంలో వందా, రెండేసి వందలూ వాళ్ళ ఇంటికి పంపిస్తూంటే - తనెప్పుడైనా బాధపడిందా! తగవులాడిందా! మరి ఇప్పుడు? తన సంపాదన తన తండ్రి తినడానికి హక్కులేదా! తనకుజన్మనిచ్చి - పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు చెప్పి - ఇంతదాన్ని చేసిన తల్లిదండ్రులని తన సంపాదనలో తృణమో, పణమో ఇచ్చి సంతోషపరచే అదృష్టం కూతురికి లేదా! ఛీ! ఛీ! ఈ మగవాళ్ళంతా ఒకటే! వొట్టి స్వార్థపరులు. బల్ల మీద పడేసిన కవరు డ్రాయర్లో

పడేసి వంటగదికేసి నడిచింది వసుధ.

రాత్రి ఎనిమిది గంటలయినా ప్రసాద్ జాడలేదు. వంట పూర్తిచేసుకొని వికలమైపోయిన మనస్సుతో మంచం మీద వాలిపోయింది వసుధ. ఆమె మనస్సులో ఏదో సంఘర్షణ బయలుదేరింది. ఉవ్వెత్తుగా ఎగసిపడుతున్న భావావేశాలకు ఆమె తట్టుకోలేక సతమతమవుతూంది.

వీధి గుమ్మం చప్పుడయింది. చప్పున లేచి తలుపుగడియ తీసింది. ఎదుర్గుగా ప్రసాద్ ! అతనితో ఏమని మాట్లాడాలో తోచలేదు వసుధకి. మౌనంగా వంటగదిలోకి వెళ్ళి భోజనం టేబిల్ మీద సర్దింది. ప్రసాద్ ఆమెని పిలవలేదు. అతను భోజనం చేసిన జాడేలేదు. వసుధకి చెప్పలేనంత విరక్తి-దుఃఖం ముంచుకువచ్చాయి. రోషంతో - స్వాభిమానంతో ఆమె గుండెలు మండిపోతున్నాయి. తనకి భోజనం చేయాలనిపించలేదు. వంటిల్లు గడియ వేసేసి డ్రాయింగ్ రూంలో పుస్తకాలు ముందేసుకు కూర్చుంది. కళ్లు మాటిమాటికి చెమ్మగిల్లుతున్నాయి. రకరకాల ఆలోచనలు మనస్సును అల్లకల్లోలం చేసి వేస్తూంటే-టేబుల్ మీద తల వాల్చి కాస్సే పటికి అలానే నిద్రపోయింది.

అవతల ప్రసాద్ పరిస్థితి కూడా అలానే వుంది. బెడ్‌రూంలో నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతు న్నాడు. అతని మనస్సంతా చికాగ్గా ఏదోలా అయి పోతోంది. అతన్ని ఒకే ఒక ప్రశ్న తొలిచి వేస్తూంది. తను ఎందుకలా తొందరపడ్డాడు? ఎందుకు తొందరపడ్డాడు? వసుధ మనస్సు ఎంత గాయపడిందో? ఆమె మొహం చూడడం ఎలా? మొహాన్ని దిండులో దూర్చి గాఢనిట్టూర్పు విడి చాడు. పశ్చాత్తాపమనే భావం అతని మనస్సులో అణువణువునా ఆవరించుకుపోయింది.

మర్నాడు—యధావిధిగా పది గంటలకు భోజ నాలు ముగించుకొని ప్రసాద్ ఆఫీస్‌కి—వసుధ స్కూలుకి బయలుదేరారు. ఎవరి మొహాల్లోనూ కళాకాంతుల్లేవు. ముక్తసరిమాటలతోనూ-ఎడ మొహం—పెడమొహంతోనూ గడచిపోయింది ఆ కాస్తకాలం. ఆఫీస్‌కి వెళ్ళి పెన్ కోసం జేబులో చేయిపెట్టిన ప్రసాద్ చేతికి ఒక కాగితం మడత దొరికింది. ఇవతలకులాగి చూసాడు.

"ప్రసాద్ ! రాత్రంతా ఆలోచించాను. నేను చేసింది పొరపాటేనని గ్రహించాను. ఇక ముందెప్పుడూ-మీతో చెప్పకుండా-మీతో సంప్రదించ కుండా ఏ పనీ చేయను. ఈసారికి ఈ తప్పిదాన్ని క్షమించమని అడుగుతూ."

_ వసుధ

సరిగ్గా అదే సమయంలో - హేండ్‌బాగ్‌లో దొరికిన చీటీని విప్పుకు చదువుకుంటోంది వసుధ.

"వసూ డియర్ ! నిన్నటి నా ప్రవర్తనకి 'చాలా' సిగ్గుపడుతున్నాను. రాత్రంతా మనోవ్యథలో కుమిలి పోయాను. చాలా తొందరపడ్డాను కదూ ! నా పొరపాటును క్షమించవా? ఇంకెప్పుడూ నిన్నిలా కించపర్చను. ఈ రాత్రి నా గుండెల మీద వాలి నన్ను క్షమించానని మనసార చెబుతావు కదూ !"

—నీ ప్రసాద్

□



పిపాసి

(నవల)

[రచన : శారదా అశోకవర్ధన్; ప్రచురణ : యం. శేషాచలం అండ్ కో, నుంకురామచెట్టి వీధి, మద్రాసు-1; వెల : రూ. 3.50 పేజీలు : 162]

ఏదో ఒక మంచి కథావస్తువును ఎన్ను కున్నప్పుడు దాన్ని ఎలా చెపుతున్నాము అని ఆలోచించకుండా అక్షరరూపం కలిపించే రచయిత్రులు ఎక్కువవుతున్నారనిపిస్తోంది. "రచన కుటీరపరిశ్రమైపోయింది ఆడవారి చేతులో పడి." అనే విమర్శనలు విన వస్తున్న ఈ కాలంలో రచయిత్రులు మరింత జాగ్రత్తగా రాయవలసిన అవసరం చాలా ఉంది. "పిపాసి" లో మంచి కథావస్తువు ఎన్నుకున్నారు రచయిత్రి. సన్ని వేశాలలో కొన్ని చక్కగా ఉన్నాయి. కానీ, కూర్పు, సంభాషణ విషయంలో మరింత జాగ్రత్త తీసుకుని వుంటే బావుండేదనిపిస్తుంది.

చిన్నతనంలో తప్పిపోయిన రాధిక గొప్ప డాన్సర్ అవుతుంది. కళను, సౌందర్యాన్ని వెలకట్టే ఒక దుర్మార్గుడి చేతులో ఉంటుంది. బాల్యమిత్రుడు, చిత్రకారుడు అయిన మదన్ ఆమెను గుర్తుపడతాడు. ఆమె పవిత్రతను, కళను, మంచితనాన్ని ప్రేమించి ఆమెను ఆ మురికి కూపం నుంచి బైటకు తీసుకు వస్తాడు. వివాహం చేసుకుంటాడు. కానీ, సంఘం ఆమెనొక వెలకు అమ్ముడు బోయిన వ్యక్తిగా గుర్తించి, బాధపెడుతూనే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఆమెను తిరిగి నర్తకిగా మారమని మదన్ అడిగి నప్పుడు అతడి కళాపిపాస వెనక ధనేచ్ఛ ఉందని అపోహపడుతుంది రాధిక. ఇక్కడనుంచి కథ రకరకాల మలుపులు తిరుగుతుంది. కళాపిపాసి, మదన్ స్నేహితుడు అయిన సత్యం ఒక మంచి క్యారెక్టర్. కానీ, ఏ క్యారక్టర్‌కి పరిణతి, సంపూర్ణత లేవు. పుస్తకాలు కాలక్షేపానికి చదువుకోడానికే అనుకుంటే ఈ పుస్తకం బావున్నట్లే లెక్క.

ఆర్తి

(నవల)

[రచన : వేదుల శకుంతల; వెల : రు. 3 50; పేజీలు : 152; ప్రచురణ : ఎమ్. శేషాచలమ్ అండ్ కో, మద్రాసు.]

ఇది పిచ్చివాళ్ళ కథే అయినా పిచ్చి కథ మటుకు కాదు. మానవత్వాన్ని తట్టి లేపి, మనసున్న మనుషుల్ని కళ్ళముందు నిలబెట్టి, ఏకబిగిన పఠితలచేత చదివించే చక్కటి నవల.

"ఆ రోజు బ్యాండ్‌వాడ్ని చూసి నేననుకొని ఏడ్చావా?"

"అవును....నువ్వు కాదా? అమ్మ కాదని చెప్పిందిలే"

"నేనే అయితే ఏం?"

ఊహుఁ నువ్వు నా పెళ్ళివాడివి కదా....మరి వాళ్ళ పెళ్ళికి ఎందుకు వెళ్ళాలి?"

"వెళ్ళకూడదా?"

"ఏమో నాకు ఏడ్పు వస్తుంది."

మతి స్థిమితం లేకపోయినా, జగత్తులో స్థిరంగా నిల్చిపోయే అనిర్వచనీయమైన ప్రేమను నిరూపించిన శ్యామల, భార్య మనసుని అభిమానంతో, ప్రేమతో అర్థం చేసుకొని ఆర్తిగా దగ్గరైన వేణు, మళ్ళీ జన్మలో మెంటల్ హాస్పిటల్లో డాక్టరుగానో, నర్సుగానో పుట్టాలని కోరుకొనే సురేఖ........పాఠకులు తొందరగా మర్చిపోలేని మంచి పాత్రలు.

నవల చదవటం పూర్తికాగానే....ఆర్తితో.... చెప్పలేని అనుభూతితో హృదయం స్పందిస్తుంది. ఒక వెరైటీ నవల చదివామనే తృప్తి చదువరులకు కల్గుతుంది.